క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో నాగ ప్రతిష్ట



షిర్డిసాయిబాబా ఆలయంలో ప్రతిష్టించిన నాగ దేవతలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని పార్నపల్లె రోడ్డు సమీపంలో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నాగ దేవతల ప్రతిష్ట, రాగి చెట్టు, వేప చెట్టు కల్యాణం కమనీయంగా సాగింది. సోమవారం ఉదయం వేద పండితులచే మంత్రోఛ్చారణల మధ్య గణపతి పూజ, నవగ్రహ పూజ, సహస్ర నామార్చన, ఉభయదారుల సంకల్ప పూజ, హోమాలు, పుణ్యావచనం, పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నాగ దేవతలకు ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య కుటుంబ సభ్యుల చేతుల మీదుగా పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మండల స్థాయి క్రీడా ఎంపికలు

కమలాపురం: స్థానిక బాలయోగి గురుకుల పాఠశాలలో బుధవారం నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కమలాపురం మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జె. వెంకటసుబ్బన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్-14, అండర్-17 విభాగాలకు చెందిన బాల బాలికలకు ఈ నెల 8వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మండల స్థాయి క్రీడా ఎంపికలు నిర్వహిస్తామన్నారు. 8వ తేదీన కబడ్డీ, చెస్, యోగా, బ్యాడ్మింటన్, 9న ఖోఖో, వాలీబాల్, 10న అథ్లెటిక్స్ విభాగంలో ఎంపికలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన పీడీలు, పీఈటీలు తమ క్రీడా కారులతో కలసి 9గంటలకు గురుకుల పాఠశాలకు చేరుకోవాలని ఆయన కోరారు. అలాగే క్రీడాకారులు మిడ్ డే మీల్స్ ఫామ్స్ తీసుకొని రావాలని, పూర్తి వివరాలకు 99898 61038 నంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

జూదరుల అరెస్ట్

కొండాపురం: మండల పరిధిలోని చామలూరు పునరావాస కాలనీ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని తాళ్లప్రొద్దుటూరు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ రాయపాటి బాసు వివరాల మేరకు స్థానికులు సమాచారమివ్వడంతో సిబ్బందితో వెళ్లి జూద శిబిరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద నుంచి రూ.1,010 నగదు స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

చెత్త సేకరించాలి

వేంపల్లె : వేంపల్లెలోని ఫిరమిడ్ నగర్, చైతన్య పాఠశాల వీధిలో ప్రతి రోజూ చెత్తను సేకరించాలని పంచాయతీ అధికారులను ఎంపీటీసీ భారతి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వేంపల్లెలోని ఫిరమిడ్ నగర్ వీధిలో గత కొన్ని రోజుల నుండి పారిశుద్ధ్య కార్మికులు చెత్తను సేకరించకపోవడంతో ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడంలేదని, చెత్త పేరుకుపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ఫిరమిడ్ నగర్‌లో ప్రతి రోజూ చెత్తను సేకరించి తీసుకెళ్లాలని అధికారులను ఆమె కోరారు.

వాటర్ ట్యాంకులు శుభ్రం



ఇ.కొత్తపల్లెలో వాటర్ ట్యాంకును శుభ్రం చేయించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

సాక్షి ఎఫెక్ట్..

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని గ్రామాలలో వాటర్ ట్యాంకులు అపరిశుభ్రంగా ఉన్నాయని రెండు రోజుల క్రితం సాక్షి పత్రికలో 'తాగు నీరు కలుషితం.. కావాలి అప్రమత్తం' అనే శీర్షిక వార్త ప్రచురితమైంది. దీనికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి కొత్తపల్లె గ్రామానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, సర్పంచ్ ప్రసాద్, గ్రామ కోఆర్డినేటర్ శేఖర్‌లు వెళ్లి అపరిశుభ్రంగా ఉన్న వాటర్ ట్యాంకును శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పాచి పట్టి ఉన్న ట్యాంకును పరిశుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించామని తెలిపారు.

సన్మానం

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక ఏపీ ఎన్‌జీవో హోంలో సోమవారం ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దయ్యను అసోసియేషన్ తాలుకా అధ్యక్షుడు జగన్నాథరెడ్డి ఘనంగా సన్మానించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య గత నెల 10వ తేదీన కడపలో జరిగిన ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఎన్నికలలో జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ తాలూకా సెక్రటరీ ప్రసాద్, సహాయ అధ్యక్షులు సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యో అరటి!

- గణనీయంగా తగ్గిన ధరలు
- పెట్టుబడులు కూడా రావడంలేదని రైతుల ఆందోళన
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

పులివెందుల రూరల్ : అరటి రైతు వెన్ను విరిగింది. ధర రోజురోజుకీ పతనమవుతుండటంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. దళారులు ఇష్టమొచ్చిన ధర అడుగుతుండటంతో లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి తక్కువకు అమ్మలేక రైతులు లబోదిబోమంటున్నారు. చెట్లపై కాయలు పండు వారుతుండటంతో దళారులు అడిగిన ధరలకే అమ్ముకోవాల్సి వస్తోంది. పులివెందుల నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో అరటి పంటను సాగు చేశారు. ఎకరా అరటి సాగుకు సుమారు లక్ష రూపాయలు పెట్టుబడి అవుతుంది. అయినా రైతులు ఖర్చును లెక్కచేయకుండా అప్పులు చేసి మందులు చల్లి, ఎరువుల వాడి అరటి పంటను పండిస్తున్నారు. అయితే పంట చేతికొచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో ఆత్మహత్యలే శరణ్యమని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది టన్ను అరటి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు పలికితే.. ఈ ఏడాది అరటి టన్ను మొదటి క్వాలిటీ అరటి కాయలు రూ.5వేల నుంచి రూ.10వేలు పలుకుతున్నాయి.

కొనే నాథుడే లేడు

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి లేకపోవడంతో అరటికాయల రేటు గణనీయంగా తగ్గిపోయిందని రైతులు అంటున్నారు. కనీసం టన్ను అరటి రూ.15వేలకు విక్రయిస్తేనే గిట్టుబాటు అవుతుందని చెబుతున్నారు. ఇంకా కొన్ని రోజులుంటే తోటలోనే అరటి కాయలు మాగిపోయి కొనే నాథుడే ఉండడని వాపోతున్నారు. అరటి ధరలు పతనం కావడంతో పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. అరటికి గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. అలాగే కోల్డ్ స్టోరేజ్‌ను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.



అరటి గెల



నల్లపురెడ్డిపల్లె గ్రామంలో సాగు చేసిన అరటి పంట

4ఎకరాల్లో సాగు చేశాను



మాది పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామం. నేను 4 ఎకరాల్లో అరటి పంటను సాగు చేశా. ఎకరాకు లక్ష రూపాయలు పెట్టుబడులు పెట్టాను. పంట దిగుబడులు చేతికొచ్చే సమయానికి ధరలు పతనమయ్యాయి. పెట్టిన పెట్టుబడులు కూడా రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అరటి రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి.

– ప్రసాద్‌రెడ్డి, అరటి రైతు, నల్లపురెడ్డిపల్లె, పులివెందుల మండలం

కోల్డ్ స్టోరేజ్ ప్రారంభించాలి



గిట్టుబాటు లేనప్పుడు నిల్వ చేసుకొని ధరలు బాగా ఉన్నప్పుడు అరటికాయలను అమ్ముకునేందుకు కోల్డ్ స్టోరేజ్‌ను ప్రారంభించాలి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రైతుల సంక్షేమం కోసం రూ.35కోట్లతో కోల్డ్ స్టోరేజీను నిర్మించారు. కూటమి ప్రభుత్వం స్పందించి కోల్డ్ స్టోరేజ్‌ను ప్రారంభించాలి.

– రమణ, అరటి రైతు

వర్షం కురిస్తే.. అవస్థే



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శివమ్మ

జమ్మలమడుగు: మున్సిపాలిటీ పరిధిలోని ఒకటి, రెండవ వార్డుల్లో వర్షం పడితే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డుపై నీరు నిల్వ ఉండటంతో వాహనాదరులు, ప్రజలు అవస్థలు పడుతున్నారని ఒకటో వార్డు కౌన్సిలర్ ముల్లాజానీ పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు తమ వార్డులో ఉన్న సమస్యలను వివరించారు. 10వ వార్డు కౌన్సిలర్ శివ మాట్లాడుతూ అంబవరంలో నిర్మిస్తున్న ఇండ్ల నిర్మాణ పనులు నత్తనడకక సాగుతున్నాయని తెలిపారు. అక్కడి ప్రజలకు తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు బిల్లులు సక్రమంగా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. వర్షం నీరు నిలువకుండా చూడాలని, దోమలవ్యాప్తిని నిరోధించాలని పేర్కొన్నారు. అనంతరం చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వర్షకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా కాలువల్లో పూడికతోపాటు, రోడ్లకు మరమ్మతులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



ఆర్డీఓ చిన్నయ్యకు వినతి పత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

పులివెందుల టౌన్ : ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట్రాములు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీఓ చిన్నయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గం వేంపల్లె మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న పాములూరు పెద్దరాయి బండ వద్ద సర్వే నంబర్ 513లో కోట్లాది రూపాయలు విలువ చేసే 7 ఎకరాల ప్రభుత్వ భూమిని వేంపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు ఎద్దుల శేషారెడ్డి ఆక్రమించారని, ఆక్రమణ చేసిన ప్రభుత్వ భూమిలో అక్రమంగా పంటలు సాగు చేశారని తెలిపారు. ఇదే విషయంపై పాములూరు గ్రామస్తులు గ్రామదర్శిని కార్యక్రమంలో వేంపల్లె తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూడా ఫిర్యాదులు చేసిన వేంపల్లె రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రెవెన్యూ అధికారులపై కూటమి నేతలు ఒత్తిడి చేసి ప్రభుత్వ భూమి ఆక్రమణకు సహకరిస్తున్నారని ఆరోపించారు. అధికార బలంతో కూటమి నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడం మంచిది కాదని హితవుపలికారు. తక్షణమే ఈ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వ భూమిని పేదల ఇంటి నిర్మాణాల కోసం పంచుతామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా భూములు లేని పేదలను గుర్తించి వారి ప్రభుత్వం భూములు పంచాలని పేర్కొన్నారు. సీపీఐ మండల నాయకులు అమీర్ బాషా, బ్రహ్మం పాల్గొన్నారు.

ఓబన్న పోరాట స్ఫూర్తి మరువలేనిది



పులివెందుల : వడ్డెర ఓబన్న చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు



వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

వేంపల్లె: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న పోరాట స్ఫూర్తి మరువలేనిదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహరెడ్డికి చేదోడు వాదోడుగా వడ్డెర ఓబన్న నిలిచారని గుర్తుచేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వడ్డెర ఓబన్న వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాగేంద్ర మాట్లాడుతూ మరుగునపడ్డ స్వాతంత్ర సమరవీరులలో రాయలసీమ ప్రాంతనికి చెందిన వడ్డెర ఓబన్న కూడ ఒక ప్రముఖుడు అని, ఇలాంటి వారిని చరిత్ర మరువకూడదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాల కొండ గంగాధర్, నాగలక్ష్మీదేవి, మాధవరావు, పీడీ తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్డెర ఓబన్నకు ఘన నివాళి

పులివెందుల : పులివెందుల పట్టణంలోని స్థానిక శ్రీశ్రీ కేఫ్‌లో సోమవారం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న వర్ధంతి సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ వడ్డెర ఓబన్న చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ వడ్డెర ఓబన్న బ్రిటీష్ వారిని ఎదిరించి గెరిల్లా యుద్ధ తంత్రంతో బ్రిటీష్ సైన్యాలను గడగడలాడించిన వీరుడు అని కొనియాడారు. కార్యక్రమంలో పులివెందుల వడ్డెర సంక్షేమ సంఘ సభ్యులు వెంకటరమణ, వెంకటస్వామి, ప్రశాంత్, లోకేష్, అమర్, మోహన్, శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి అమానుషం

కమలాపురం: సనాతన ధర్మానికి అవమానం జరిగిందన్న పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై అడ్వకేట్ దాడి చేయడం అమానుషమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు.సోమవారం ఆయన కమలాపురంలో విలేకరులతో మాట్లాడుతూ నిందితుడిని శిక్షించాలని కోరారు. మోదీ పాలనలో ఇప్పటి వరకు మతోన్మాదులు అన్ని వ్యవస్థలను ధ్వంసం చేస్తూ వచ్చారని, ఇపుడు బహిరంగంగా సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పైనే దాడి చేయడం రాజ్యాంగానికి, దేశ ప్రజలకు అవమానమన్నారు. దాడి చేయడం సనాతన ధర్మమా? అని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోదీ దీనికి సమాధానం చెప్పాలన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పరామర్శ



సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వేముల : వేములలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మేకల సుబ్బారెడ్డిని సోమవారం మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి గ్రామస్థాయి నాయకులతో కలిసి పరామర్శించారు. ఇటీవల మేకల సుబ్బారెడ్డి బెంగళూరులో కాలికి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సాంబశివారెడ్డి వేముల వెళ్లి సుబ్బారెడ్డిని పరామర్శించి ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా వెంకట నారాయణ, రాఘవరెడ్డి, మల్‌రెడ్డి, కొత్తపల్లె శ్రీనివాసులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జీఎస్టీ అధికారులు

పులివెందుల : పట్టణంలోని స్థానిక బ్యూటీ పార్లర్స్, సెలూన్స్, జిమ్ సెంటర్స్, ట్రాక్టర్ షోరూంలలో సోమవారం మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానానంద రెడ్డి మాట్లాడుతూ దుకాణాదారులు తగ్గిన జీఎస్టీ రేట్లను డిస్‌ప్లే బోర్డులో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీఎస్టీ అధికారులు రాజశేఖర్ రెడ్డి, పుష్పలీల, స్వరాజ్యలక్ష్మి, యాసిన్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒకే పన్ను విధానం ఎంతో ప్రయోజనకరం

వేంపల్లె : ఒకే దేశం ఒకే పన్ను విధానం ఎంతో ప్రయోజకరమని ప్రిన్సిపాల్ నాగేంద్ర పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలోని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాగేంద్ర మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వలన స్వదేశీ వస్తువుల వాడకం పెరుగుతుందని, దీనివల్ల ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సతీష్, అధ్యాపకులు మల్లేశ్వరమ్మ, వినోద్ కుమార్, ఓబుళరెడ్డి, నాగలక్ష్మీదేవి, షఫివుద్దీన్, కిరణ్మయి, కేశమ్మ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కష్ట జీవులను కాటేస్తున్న కల్తీ మద్యం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు

పులివెందుల టౌన్ : కల్తీ మద్యం తయారు చేస్తూ కష్టజీవుల జీవితాలను టీడీపీ నాయకులు నాశనం చేస్తున్నారని, కల్తీ మద్యం తయారీదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు వి.రామ్ లక్ష్మణ్ రెడ్డి, స్టూడెంట్స్ విభాగం జిల్లా కోశాధికారి రాఘవేంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మద్యం మాఫియా రెచ్చిపోతోందని ఆరోపించారు. డ్రగ్స్, గంజాయితో పాటు మత్తు పదార్థాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. బెల్టు షాపులను అరికట్టాలని కోరారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

పని భారంతో మానసిక ఒత్తిడి



ఏపీఎంకు వినతి పత్రం అందిస్తున్న వీఓఏలు

పులివెందుల రూరల్ : పులివెందుల మండల సమాఖ్యలో పనిచేస్తున్న వీఓఏల పని భారాన్ని తగ్గించాలని డ్వాక్రా సంఘాల మహిళలు కోరారు. సోమవారం పట్టణంలోని స్థానిక డీఆర్డీఏ కార్యాలయంలో ఉన్న ఏపీఎం గురురాజుకు డ్వాక్రా సంఘాల మహిళలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ పనిభారంతో మానసిక ఒత్తిడికి గురువుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై గత కొంతకాలంగా ప్రభుత్వ అధికారులకు పలుమార్లు వినతి పత్రాలను సమర్పించామన్నారు. అయినా సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. 5జీ మొబైల్స్ ఇవ్వకుండా కిందిస్థాయిలో ఆన్‌లైన్ వర్క్‌లు చేయలేదని వేధిస్తున్నారని తెలిపారు. హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు.

వరికి మద్దతు ధర ఇవ్వాలి



ఏఓ శివశంకర్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న రామకృష్ణారెడ్డి, రైతులు

వేంపల్లె : వరికి మద్దతు ధరను కల్పించి ధాన్యం కొనుగోలు చేయాలని మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓ శివశంకర్ రెడ్డికి రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం ప్రభుత్వ మద్దతు ధర రూ.2,369 ఉందని, అయితే దళారులు 81 కేజీల వరి ధాన్యం బస్తాను కేవలం రూ.1,340 కొనుగోలు చేస్తున్నారన్నారు. వీటిని నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వరి ధాన్యాన్ని ప్రభుత్వం సివిల్ సప్లయ్ ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. ఒకవైపు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక ఆందోళన చెందుతున్నారని, మరోవైపు దళారుల దోపిడికీ గురై తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వేంపల్లె, అలిరెడ్డిపల్లి, తువ్వపల్లి, ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లి, కుమ్మరాంపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ఆదర్శ రైతులు వెంకట నారాయణరెడ్డి, శంకరయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి



నూతన కమిటీ సభ్యులతో కోలా ప్రసాద్

పులివెందుల టౌన్ : క్రైస్తవులపై, క్రైస్తవ మందిరాల ఆస్తులపై దాడులను అరికట్టాలని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక కేపీ ఫౌండేషన్ కార్యాలయంలో యునైటెడ్ క్రిస్టియన్ ప్రొటెక్షన్ కమిటీ ఇండియా కమిటీ సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులకు రక్షణ కల్పించాలని, అలాగే దాడి చేసినే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొందరు కులాల మధ్య చిచ్చుపెట్టాలని కుట్ర చేస్తున్నారని తెలిపారు. క్రైస్తవులు ఏ ఒక్కరికి వ్యతిరేకం కాదన్నారు. ప్రతీ ఒక్కరికి ప్రేమ ఆప్యాయత దయ కరుణను చూపిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా షద్రక్, కమిటీ సభ్యులుగా శ్రీను, జాన్, అభినెజర్, విజయ్, డేవిడ్‌ను నియమించారు. కోలా ప్రకాశం, పులివెందుల పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రశాంత్, కృపరాజు, కిరణ్, దేవరాజు, అశోక్, క్రాంతి పాల్గొన్నారు.

శ్రీరామ్ ఫైనాన్స్ సిబ్బందిపై ఆర్డీఓకు ఫిర్యాదు

జమ్మలమడుగు: పట్టణంలోని శ్రీరామ్ ఫైనాన్స్ సిబ్బంది వేధింపులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆర్డీఓ సాయిశ్రీకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైనాన్స్ సిబ్బంది లోన్ రికవరీ సమయంలో రుణగ్రస్తులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వకుండా లోన్ తీసుకున్న వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆర్డీఓకు వివరించారు. ఒక్క ఈఎంఐ పెండింగ్‌లో ఉన్న బలవంతంగా వాహనాలను తీసుకుపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ అధ్యక్షుడు ఎల్లయ్య, సుభహాన్ తదితరులు పాల్గొన్నారు.

నరకానికి రాదారులు



వద్దిరాల చావిటి వీధి వద్ద రహదారి దుస్థితి

మైలవరం: ఏ రోడ్డు చూసినా ఏముంది గర్వకారణం.. అంతా గతుకుల మయం.. ఆపై భయం భయం..! వద్దిరాల పరిసర గ్రామాల రహదారుల దుస్థితి ఇది. ప్రధాన మార్గాలు కూడా అధ్వానంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగంలో చలనం లేకపోవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. గ్రామీణ ప్రాంత రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయి. దీంతో పల్లెవాసులు రోడ్లపై వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. ఇక వర్షాలు పడితే రోడ్లపై దిచక్ర వాహనాలు సైతం వెళ్లడానికి వీలులేకుండా ఉంటోందని వాహనదారులు వాపోతున్నారు. వద్దిరాల పరిసర గ్రామాల ప్రజలు వర్షానికి ధ్వంసమైన రోడ్లపై ఎక్కడికక్కడ ఉన్న గుంతలు మరింత పెద్దవై ప్రజలకు నరకం చూపుతున్నాయి. గోతుల రహదారుల్లో ప్రయాణించడానికి జనం పడుతున్న బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఒళ్లు హూనమవడం ఒకెత్తయితే, గోతుల్లో పడి తీవ్ర గాయాలపాలవుతున్న జనం పరిస్థితి చెప్పక్కర్లేదు. వర్షాలకు రోడ్లన్నీ గుంతల్లో నీరు చేరి చెరువులుగా మారాయి.రోడ్డు ఏదో.. చెరువు ఏదో తెలియదన్నంత దారుణంగా రహదారులు తయారయ్యాయి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ద్విచక్రవాహనదారులు బెంబేలెత్తుతున్నాయి. మండలంలో ఇవే కాకుండా ప్రతి గ్రామానికి వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా తయారయ్యాయని, కనీసం ఇప్పటికైనా ఈ గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



వద్దిరాలలో మోకాటి లోతు నీటిలో వాహనదారుల అగచాట్లు



అధ్వానంగా వద్దిరాల-దొడియం రోడ్డు